

## మొండ్రు వెంకట నారాయణ

సాయం సమయం!

ఒంటరిగా లాన్‌లో కూర్చుని ఉంది స్పందన. ఆమె మన సంతా గజి బిజిగా ఉంది. ఏదో తీవ్రంగా యోచిస్తోంది. మాటి మాటికీ ఎడమ చేతి మునివేళ్ళతో కణతలను నొక్కుకుంటోంది.

దూరంగా - సంధ్యాకాశపు అరుణ వర్ణం.

ఆ రోజూ - సరిగ్గా ఇదే సమయం. తోటలో కూర్చుని ఉంది తను. ఎప్పుడు వచ్చాడో వచ్చాడు శరత్ చంద్ర.

"హాయ్" అంటూ కదలబోయింది తను.

"అహహ కదలకు. ముఖం కూడా అటే ఉంచు. ఇందాకటి మాదిరే - ప్రకృతిలోకి చూస్తూ కూర్చో-" అన్నాడు.

చక చకా కాన్‌వాస్ అమర్చాడు. రంగులు కలిపాడు. పదిహేను నిమిషాల్లో చిత్రాన్ని లిఖించి తన ముందు పెట్టాడు.

సంభ్రమంగా చూసింది తను. ఇది తన రూపేనా? ఇంత అందంగా ఉంటుందా తను! ఇంత ముగ్ధత్వం ఉందా తన మోములో? రాగ రంజితమైన ఆ చెక్కిలీ, అర్ధ నిమీలితాలైన ఆ మీన నేత్రాలూ తనవేనా? ఓహ్! సంపెంగ లాంటి ఆ నాసిక సమరిన ముక్కు పుడక తళుక్కు మనేలా ఎంత హృద్యంగా చిత్రించాడు!

ఒక అసాధారణ వ్యక్తిని చూస్తున్నట్లు చూసింది తనతన్ని. అంతటి కళా స్రష్ట, సౌందర్య పిపాసి - తనను హృదయ రాణిగా ఆరాధిస్తున్నందుకు గర్వంతో తన హృదయం పులకరించింది. కానీ ....

ఏదో సంఘర్షణ ఆమె మనసు నావరించింది.

దూరంగా చంద్రోదయా న్నావృతూ కమ్ముకొస్తున్న కరి మబ్బులు. వేదనను కలిగజేస్తూ కమ్ముతున్న సంవేదనలు.

శరత్ చంద్ర ఎమ్మేలో తన క్లాస్‌మేట్. అందగాడూ, చిత్రకారుడూ కూడా. అతను ఆర్థికంగా దిగువ స్థాయిలో వాడైనా తను లైక్ చెయ్యడానికి అదే కారణం. అతనితో తన పెళ్ళికి తన వాళ్ళ నుంచి ఎటువంటి అభ్యంతరమూ ఉండదు. కానీ తనకే ఏదో అసంతృప్తి ... ఏదో శంక. అతనితో కలిసి తిరిగిన కొద్ది రోజుల్లో అతని మనస్తత్వాన్ని ఎనలైజ్ చెయ్యగా తేలిన భీకర సత్యం వల్ల కలిగిన జంకు! ఏమిటిపుడు తన నిర్ణయం?

'నీ లాంటి సౌందర్యరాశి నా సహచరి అయితే - ఎన్నో కళాఖండాల్ని సృజించగలను స్పందనా! ఈ మాట పైన నీ నిర్ణయాన్ని రేపు తెలుపగలవా నాకు?' అన్న చంద్ర మాటలకు రేపు తనివ్వబోయే జవా బేమిటి?

ఆమె ఆలోచనలను తెంపుతూ పై నుంచి ఒక వర్షపు చినుకు టప్ మని పడింది. చినుకుల పరంపర!

ఛెయిర్ తీసుకుని వడి వడిగా భవంతిలోకి నడిచింది. తన గదిలోకి వెళ్ళి కూర్చుంది. కరెంట్ లేదు. తన రూపాన్ని క్షీణింప జేసుకుంటూ నిర్వికారంగా వెలుగుతోంది కొవ్వొత్తి.

ఒక్క క్షణం ఆ కొవ్వొత్తి వంక నిశ్చలంగా చూసింది. 'కాసేపటి కా కొవ్వొత్తి నిరూపి అవుతుంది. తన పూర్తి అస్తిత్వాన్ని కోల్పోతుంది. కోల్పోతుంది. . అలా అనుకోగానే ఆమె గుండె - ఏదో తెలియని భీతితో వణికింది ఒక్క క్షణం.

మళ్ళీ ఆలోచనలు. ఆలోచనల నిర్బంధం!

బయట వర్షం ఉధృతమైంది. కిటికీలో నుంచి జల్లు - పరదాలను తడుపుతూ లోపలికి కొడుతోంది. పెద్ద ప్రశ్నార్థకం కళ్ళ ముందు నిలబడి మెదడును కాల్చేస్తోంది.

"అమ్మగారు భోజనానికి రమ్మంటున్నారమ్మా" వంటవాడు.

"ఆక ల్లేదని చెప్పు. వెళ్ళు-"

బయట నుంచి చలిగాలి.

వెలుగుతున్న కాండిల్ ఆరిపోయింది.

అదేమీ ఆమెకు పట్ట లేదు. ఒకటే ఆలోచన.

నిముషాలు దొర్లిపోతున్నాయి. గంటలు గడుస్తున్నాయి.

అర్ధరాత్రి దాటి అరగంటయింది.

బయట వర్షం తగ్గింది. నిర్మలాకాశం వెన్నెల్లో మెరుస్తోంది.

ఒక నిర్ణయాని కొచ్చిన సంతృప్తితో ఆమె నిదుర పోయింది.


* * * * *

చుట్టూ దట్టమైన అరణ్యం. మధ్యన చిన్న మైదానం. దూరంగా అస్తమిస్తున్న సూరీడు. ఆ పక్కగా - సంజె కాంతితో అరుణ వర్ణం దాల్చి గల గల పారుతున్న సెలయేరు. ఆ సెలయేటి అంచున - చెట్టా పట్టా లేసుకుని నడుస్తున్న స్పందనా, తనూ .... ఓహ్!

"పోస్ట్!"

భావనా జగత్తులో విహరిస్తున్న శరత్ చంద్ర - ఆ కేకతో ఉలిక్కిపడి ఒక్కసారిగా ఇహం లోకొచ్చాడు.

లెటర్ తీసుకుని ఫ్రం ఎడ్రస్ చూశాడు.






స్పందన - విశాఖ!

'ఇదేమిటీ? ఇక్కడి నుంచి ఇక్కడికే లెటరా? పాపం! తన ఇష్టాన్ని తన ఎదుటే తెలపడానికి సిగ్గ నిపించిందేమో, దేవి గారికి-' నవ్వుకుంటూ లెటర్ ఓపెన్ చేశాడు.

"సౌందర్యోపాస కులైన శరత్‌చంద్రగారికి నమస్సులు!

కళాకారుడు సౌందర్యానికి స్పందించడం సహజం. కానీ - మీ దృష్టీ, సృష్టీ దానికే పరిమితం. సౌందర్యారాధనలో ఒక్కోసారి ఇంగితాన్ని కూడా మర్చిపోతారు. ఎదుటి వారి విషాదంలో కూడా ఆనందమే కనిపిస్తుంది మీకు."

చదువుతున్న శరత్‌చంద్ర ముఖం వివర్ణమైంది ఒక్క క్షణం. తిరిగి చదవసాగాడు.



"ఒకసారి మన మిద్దరం మా తాతగారి ఊరెళ్ళాం గుర్తుందా? మనం అక్కడుండగానే పెద్ద పెట్టున వరద లొచ్చాయి. ఓ రోజు - చెరువుకి గండి పడేటట్టు ఉందంటే.'


"పై గ్రామాల చెరువులన్నీ గండ్లు పడి ఆ నీరంతా ఒక్క పెట్టున వచ్చి పడిపోతోందా చెరువులోకి. దూరంగా - మబ్బులు కమ్మి అస్ఫుటంగా కనిపిస్తున్న కొండలు. పై నుంచి సన్నగా వర్షపు జల్లు. ఏ క్షణాన్నైనా తెగడానికి సిద్ధంగా ఉన్న గట్టు. ఆ గట్టు కింద పచ్చని పంట పొలాలు.

"ఆహా! ఎంత మనోహరమైన దృశ్యం!" అన్నారు మీరు. ఆ బీభత్సంలో కూడా ఆనందాన్నే చూశారు కానీ, 'చెరువుకి గండి పడితే - ఆ వరద నీరు ఒక్కసారిగా తన పంట చేలో పడితే-' అన్న ఊహతో వచ్చిన దిగులుతో ఆ పక్కనే ఉన్న బడుగు రైతు కళ్ళలో రెప రెప లాడుతున్న భయం మీ దృక్కుల కెక్కలేదు. అదలా ఉంచండి.

"ఒకసారి మీ ఫ్రెండొకతను పెళ్ళికి పిలిస్తే వెళ్ళాం - గుర్తుండే ఉంటుంది. అతని కది రెండో పెళ్ళనీ, మొదటి భార్య చాల అందగత్తె అనీ, అయితే ఏధో ప్రమాదంలో ముఖం అంత







కాలిపోయిందనీ, దాంతో ఆమె - తన భర్తను ఏ విధంగానూ ఆనందింప జేయలేకపోతున్నానే అన్న దిగులుతో - అతన్ని రెండో పెళ్ళి చేసుకోమని కోరిందనీ, ఇప్పు డా పెళ్ళి - ఆమె ఇష్టం తోనే జరుగుతోందనీ చెప్పారు మీరు. ఎంత అందమైన ఆత్మవంచనండీ ఇది! ఫ్రెండుని అభినందించి, అతని పక్కనే ఉన్న నవ వధువుని చూస్తూ - "మీ లాంటి సౌందర్యరాశి భార్య కావడం - మా వాడి అదృష్టం" అంటూ పొగిడారే కానీ, విధి వైపరీత్యానికి లోబడి - దూరంగా, ఒంటరిగా కూర్చుని విలపిస్తున్న అతని మొదటి భార్య వేదనను గమనించ లేకపోయారు మీరు.

"జీవితాంతం చేయి విడువని బాధ్యతని చేపట్టి - మధ్యలోనే ఆ బాధ్యత పట్ల విముఖత్వం, అలసత్వం చూపడం న్యాయమా? అంత వరకూ సౌందర్యాన్ని వ్యక్తం చేసిన వ్యక్తి అస్తిత్వం - ఏ కారణం వల్లనైనా వికారమై సౌందర్యాన్ని వెదజల్ల లేకపోతే - ఆ ఆనందం కోసం మరో వ్యక్తిని ఆశ్రయిస్తారా? అంతవరకూ కలిసి ఉన్న పూర్వపు వ్యక్తిని మర్చి పోతారా? ఆ వ్యక్తి కిక విలువ లేనట్టేనా? చెప్పండి చంద్రా! రేపు నేను కూడా అంతే కదా! సుందరమైన నా రూపు రేపు చివికి పోవచ్చు. సౌందర్యాన్ని వ్యక్తం చేయలేకపోవచ్చు. అపుడు - నా స్థితి కూడా అంతే కదా మీ దృష్టిలో!

"క్షమించండి చంద్రా! నా నిర్ణయ మేమిటో సూటిగా చెప్పక విసిగించాను కదూ! ఇవన్నీ ఆలోచించిన మీదట - సతత సౌందర్యాన్వేషకులైన మీకు - ఈ విధమైన ఆలోచనలు కలిగిన నా లాంటి సామాన్య స్త్రీ సహచరిణిగా తగదనిపించింది. మీ జీవితంలో భాగం పంచుకోవడానికి అర్హురాలిని కాదనిపించింది. అందుకే చంద్రా, మీ హృదయ ద్వారాలు తెరిచి నాకై పంపిన ఆహ్వానాన్ని స్వీకరించ లేకపోతున్నాను. క్షంతవ్యురాల్ని.

ఇట్లు-

స్పందన.

